## క్లుప్తంగా

### కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు


అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

**చీపురుపల్లి:** స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ ఆదివారం మాదిరిగానే ఈ ఆదివారం కూడా అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అనంతరం దేవస్థానంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

### రక్తదాన శిబిరం


రక్త దానం చేస్తున్న యువకులు

**గజపతినగరం:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 53మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈసందర్భంగా సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, సాయిరేవంత్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. యువత రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్, సమాజ సేవకులు ఆరిశెట్టి భాస్కర్, ప్రసాద్, కె.ఎ.ఎస్.ఎస్.గుప్త, కె.రామునాయుడు, స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు రమ్య, అజయ్, జశ్వంత్, యశ్వంత్‌నాయుడు, రాము నాయుడు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ చక్రవర్తి

**గుర్ల:** మండలంలోని పెనుబర్తి గ్రామంలో అంబేడ్కర్ ఇండియన్ మిషన్(ఎయిమ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని చీపురుపల్లి డీఎస్పీ చక్రవర్తి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరు నడుచుకోవాలని సూచించారు. ప్రజలందరికీ ప్రాథమిక హక్కులను కల్పించిన రాజ్యాంగ ప్రధాత అంబేడ్కర్ అని అన్నారు. ఎయిమ్ సభ్యులు అల్లూరి సీతబాబు, కెల్ల భీమారావు తదితరులు పాల్గొన్నారు.

### దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న భాస్కరరావు

**జామి:** మండలంలోని భీమసింగి గ్రామానికి చెందిన వాకచర్ల భాస్కరరావు దంపతులు తమ కుమార్తె సౌజన్య జ్ఞాపకార్థం వెన్నె గ్రామంలో పేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు.అనంతరం అట్టాడ గ్రామంలోని బీఎస్ఆర్ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. జామి ఆర్యవైశ్యసంఘం మాజీ అధ్యక్షుడు కె.కృష్ణారావు,వి.ఎస్.ఎన్.కుమార్, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### కార్తీక వనసమారాధన


ఉసిరిచెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

**వేపాడ:** మండల కేంద్రంలోని పప్పుడు వారి కల్లాల్లో పప్పుడు వారి కుటుంబ సభ్యులు ఆదివారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. అర్చకులు లట్టాల శంకరశర్మ ఆధ్వర్యంలో కార్తీకదామోదరుడికి పూజలు చేసి, ఉసిరి చెట్టు వద్ద దీపారాధన చేశారు. సుమారు 500 మంది అన్నప్రసాదం స్వీకరించారు.

### పౌష్టికాహార కిట్ల పంపిణీ

**శృంగవరపుకోట:** స్థానిక గాంధీ పార్కులో జీవన్ జ్యోతి వెల్ఫేర్ అసోసియేషన్, అమ్మసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 మంది హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు, కిడ్నీ, లెప్రసీ, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఆదివారం పౌష్టికాహార కిట్లు అందజేశారు. జీవన్‌జ్యోతి వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో, గ్రామాల్లో వివిధ స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలందరినీ ఒకే తాటిపై నడిపిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలని అన్నారు. పాఠశాలలు,కళాశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన,క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


కొత్తవలస: కొత్తవలస మూడు రోడ్లు జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు, నాయకులు


శృంగవరపుకోట: ఎస్.కోట దేవీ జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


శృంగవరపుకోట: వీరనారాయణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్థానిక నాయకులు


బొండపల్లి: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ చలంనాయుడు,ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్


శృంగవరపుకోట: ఎస్.కోట బీసీ హాస్టల్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఓటరు అక్షరాస్యత వేదిక అధ్యక్షుడు సూర్యారావు


వేపాడ: సోంపురం హైస్కూల్‌లో విద్యార్థులతో రాజ్యాంగ పీఠికను చదివిస్తున్న ఉపాధ్యాయుడు


చీపురుపల్లి రూరల్ (గరివిడి): వెదుల్లవలసలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘం నాయకులు


శృంగవరపుకోట: ధర్మవరం హైస్కూల్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు


చీపురుపల్లి రూరల్ (గరివిడి): శివరాంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్ఐ దామోదరరావు


శృంగవరపుకోట: కొట్టాం ఎస్సీకాలనీలో అంబేడ్కర్‌కు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత నేతలు, గ్రామపెద్దలు


కొత్తవలస: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భీమశంకర్


గజపతినగరం: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న జెడ్పీటీసీ తవుడు,వెంకటరావు


శృంగవరపుకోట: ఎస్.కోట లైబ్రరీలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ శ్రీధర్, పాఠకులు


గంట్యాడ: మదానపురం మోడల్ స్కూల్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్దపూలు వేస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణారావు, ఉపాధ్యాయలు


గజపతినగరం: గజపతినగరం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ, తహసీల్దార్ అరుణకుమారి


చీపురుపల్లి: లావేరురోడ్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చీపురుపల్లి సర్పంచ్ సుధారాణి, ఉపసర్పంచ్ శ్రీదేవి


శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు


చీపురుపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు,నాయకులు


వేపాడ: వేపాడలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నేతలు, పెద్దలు

### ద్విచక్రవాహనాల వేలం రేపు

**జామి:** వివిధ కేసుల్లో సీజ్ చేసిన మూడు ద్విచక్ర వాహనాలకు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఈనెల 28వ తేదీన వేలం వేయనున్నట్లు ఎస్ఐ వీరబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక టీవీఎస్ ఎక్స్‌ఎల్, ఒక హీరో హోండా, ఒక హీరో స్ప్లెండర్ బైక్ వేలం వేస్తామని, ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

**ఆటో వేలం...**

**లక్కవరపుకోట:** స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో సారా తరలిస్తుండగా పట్టుబడిన ఆటోను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీన వేలం వేయనున్నట్లు ఎస్ఐ ముకుందరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్.కోట సర్కిల్ కార్యాలయంలో ఈ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఆసక్తి గలవారు ఆరోజు ఉదయం 10 గంటల లోపు వేలంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవం

**చీపురుపల్లి రూరల్(గరివిడి):** గరివిడి గోదావరి దేవి సీనియర్ సెకండరీ స్కూల్‌లో ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని చీపురుపల్లి డీఎస్పీ ఏ.ఎస్.చక్రవర్తి, ఎన్‌సీసీ అధికారి సుబేదార్ మేజర్ ఉపేంద్రసింగ్, గరివిడి జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, కొండపాలెం మేజర్ పంచాయతీ సర్పంచ్ పి.ప్రమీల ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్‌సీసీలో శిక్షణ పొందిన విద్యార్థులకు అందించే ఏబీ సీ సర్టిఫికెట్లు త్రివిధ దళాల్లో ఉద్యోగాలు సాధించేందుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులకు క్రమశిక్షణ అలవడు తుందన్నారు.ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ సురేష్ కుమార్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధులు

## శివాలయానికి వెండి ధారాపాత్ర బహూకరణ


వేపాడ: బానాది శివాలయానికి గ్రామపెద్దలకు వెండి ధారాపాత్రను అందజేస్తున్న దాతలు

**వేపాడ:** మండలంలోని బానాది గ్రామంలోని శివాలయానికి గుదే శ్రీనివాసులనాయుడు, రాధికానాయుడు దంపతులు 1.5 కిలోల వెండితో తయారు చేయించిన ధారాపాత్రను బహూకరించారు. గ్రామ పెద్దలు గల్ల రామచంద్రుడు మాస్టారు, గొంప వెంకటరావు, గొంపతులసి తదితర గ్రామపెద్దల సమక్షంలో దాతలు ధారా పాత్రను ఆదివారం అందజేశారు. అర్చకులు మేడపాటి కిశోర్ దాతలకు ఆశీర్వచనాలు అందించి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు.


చీపురుపల్లి: నకమహాలక్ష్మి ఆలయానికి వెండి కుంభహారతి పాత్రనుబహూకరిస్తున్న దాత సత్యనారాయణ

**అమ్మవారి ఆలయానికి వెండి కుంభహారతి పాత్ర..**

**చీపురుపల్లి:** స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి 52 తులాల వెండితో చేయించిన కుంభహారతిని పట్టణానికి చెందిన బీఎస్ఎన్ఎల్ జేఈ సీహెచ్.వి.సత్యనారాయణ బహూకరించారు. అమ్మవారి దేవస్థానంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్, ఈఓ జి.శ్రీనివాస్ కుంభహారతి పాత్రను ఆదివారం అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

## పథకాలపై ప్రచారం

**గంట్యాడ:** వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మండలంలోని పెదవేమలి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఎంపీటీసీ పొటుపు రెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునాయుడు, పీహెచ్‌సీ వైద్యుడు వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి ఎల్.తవుడు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై రూపొందించిన వీడియోలను ప్రచారరథంలోని ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. పీఎం అవాజ్ యోజన, గరీబ్ ల్యాణ్ అన్న యోజన, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల్ యోజన, విశ్వకర్మ, కిసాన్ సమ్మాన్, స్వమిత్వ జన్‌ధన్ యోజన, జీవన్ జ్యోతి బీమా, అటల్ పెన్షన్ యో జన, పీఎం ప్రణామ్, నానో ఫెర్టిలైజర్ పథకాల గు రించి వివరించారు. అనంతరం సంబంధిత క్యాలెండర్లు ఆవిష్కరించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


వికసిత్ భారత్ సంకల్ప యాత్ర క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, తదితరులు

### అలరించిన గానకచేరి

**విజయనగరం టౌన్:** ఆనంద గజపతి ఆడిటోరియంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సుందర్ సునేహర్ గీత్ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. విశాఖ పట్టణం డీటీసీ వడ్డి సుందర్ హిందీ చిత్రాల్లోని ఆపాత మధురాలను హృద్యంగా ఆలపించి చూపరులను కట్టిపడేశారు. అదేవిధంగా సింగర్లు అమ్మాజీరావు, అభినయ్ గంటి, ఉమాశంకర్, కావ్య చంద్రిక, గీతా సుబ్రహ్మణ్యం, గీతిక, భూమికలు పాడిన పాటలు మన్ననలందుకున్నాయి. కార్యక్రమానికి యాంకర్‌గా జోషిత వ్యవహరించారు. ఇండియన్ ఐడల్ ఫేమ్ సాయి, పవన్‌ల సంగీత సారథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాపుగంటిప్రకాష్ , ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు భీష్మారావు, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

### నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్ర' రిజిస్ట్రేషన్లు

**దత్తిరాజేరు:** డిసెంబర్ 15వ తేదీ నుంచి నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల పోటీల్లో పాల్గొనాలనుకునే వారు సోమవారం నుంచి సచివాలయాల్లో తమ పేర్లు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఎంఈఓ వెంకటరావు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. డిసెంబర్ 15 నుంచి 2024 జనవరి 26 వరకు ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 15వ తేదీ నుంచి 20 వరకు సచివాలయ స్థాయిలో, 21 నుంచి జనవరి 4 వరకు మండలస్థాయి, జనవరి 5 నుంచి 10 వరకు నియోజకవర్గస్థాయి, 11 నుంచి 21 వరకు జిల్లాస్థాయి, 22 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు.

### యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**చీపురుపల్లి:** ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. పట్టణంలోని ఆంజనేయపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం రాత్రి ఆ సంఘం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్య వర్గాన్ని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏ.సత్యశ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్ మీసాల అప్పలనాయుడు, రాష్ట్ర మహిళా కౌన్సిలర్ గొర్లె పద్మ నేతృత్వంలో ఉపాధ్యాయులు ఎన్నుకున్నా రు. మండల అధ్యక్షుడిగా ఎస్.బలరాం, ప్రధాన కార్యదర్శిగా డి.కృష్ణమూర్తితో పాటు మిగిలిన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

### పంపిణీకి సిద్ధంగా పశుగ్రాస విత్తనాలు

**లక్కవరపుకోట:** పాడి రైతులకు 75 శాతం రాయితీపై పంపిణీ చేసేందుకు పశుగ్రాస విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధం చేశామని ఎల్.కోట పశువైద్యాధికారి కె.గాయత్రీదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి సీఎస్‌హెచ్ –24,ఎంఎఫ్ జొన్న రకాల గడ్డి విత్తనాలు రెండు టన్నులు వచ్చినట్లు పేర్కొన్నారు. 5 కిలోల కిట్టు ఖరీదు రూ.460 కాగా రాయితీపై రూ.115కే అందజేయనున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన పాడి రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

## వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు


శృంగవరపుకోట: శంబలనగరిలో అఖండజ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి కృపారాణి, తదితరులు


గుర్ల: గుర్ల శివాలయం వద్ద జ్వాలా తోరణం వెలిగించి శివపార్వతుల పల్లకీ సేవ చేస్తున్న భక్తులు

- భక్తి శ్రద్ధలతో ఆలయాల వద్ద జ్వాలా తోరణ కార్యక్రమాలు

**శృంగవరపుకోట:** కార్తీకపౌర్ణమివేళ మండలంలోని రాజీపేట గ్రామంలోని గాయత్రి తపస్వి శంబలనగరి ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.ఆశ్రమంలో ఆదివారం కార్తీకపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించిన అనంతరం శివలింగానికి అభిషేకాలు చేశారు.

**10 వేల మందికి అన్నదానం**

ఆశ్రమంలో ఉదయం 11గంటలకు అన్నదానం చేశారు. ఆశ్రమానికి వచ్చిన భక్తులు, అయ్యప్ప, భవానీ, శివ, ఆంజనేయ మాలధారులు, చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు 10వేల మందికిపైగా అన్నప్రసాదం స్వీకరించారు.

**అఖండజ్యోతి ప్రజ్వలన**

శంబలనగరిలో ఆదివారం సాయంత్రం అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమానికి కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి అతిథిగా హాజరయ్యారు. ఆశ్రమంలో 300 కిలోల ఆవునెయ్యి, 300 మీటర్ల ఒత్తి, 9 కిలోల కర్పూరంతో ఏర్పాటు చేసిన అఖండజ్యోతిని ఆమె వెలిగించారు. రాత్రి 7.30 గంటలకు కార్తీక పౌర్ణమి పూజ నిర్వహించారు. కేరళ నుంచి వచ్చిన సంప్రదాయ చింగారి మేళం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆశ్రమ నిర్వాహక సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

**గుర్ల శివాలయంలో..**

**గుర్ల:** స్థానిక శివాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా అర్చకులు అరవెల్లి సరేష్‌శర్మ ఆధ్వర్యంలో జ్వాలా తోరణం కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా శివాల లో పూజల అనంతరం జ్వాలాతోరణం వెలిగించి స్వామి వారిని పల్లకిలో తిరువీధి ఉత్సవాన్ని జరిపించారు.పల్లకి సేవలో శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.


గజపతినగరంలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద వెలిగించిన జ్వాలాతోరణాన్ని తిలకిస్తున్న భక్తులు


పురిటిపెంటలోని సంతతోట శివాలయంవద్ద శివలింగాకారంలో చేసిన దీపారాధన

**గజపతినగరంలో..**

**గజపతినగరం:** స్థానిక ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి నేపథ్యంలో అర్చకులు రాంబాబు ఆధ్వర్యంలో జ్వాలా తోరణం కార్యక్రమం నిర్వహించారు.అనంతరం భక్తులు శివపార్వతుల పల్లకీ సేవలో పాల్గొన్నారు. అలాగే గజపతినగరంతో పాటు పురిటిపెంటలోని సంతతోట శివాలయం వద్ద భక్తులు దీపారాధన చేశారు.

### నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

**చీపురుపల్లి:** స్థానిక మేజర్ పంచాయతీలోని గ్రామ సచివాలయం– 4 పరిధిలో సోమవారం ఉదయం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.గిరిబాల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయం -4 పరిధిలోని లావేరురోడ్‌లో ఉదయం 10 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని అన్నిశాఖల అధికారులు, సంబంధిత సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు హాజరవ్వాలని కోరారు.

## రూ.2 కోట్లతో బీటీ రోడ్డు పునరుద్ధరణ

**జామి:** మండలంలోని సోమయాజులపాలెం–శాశనపల్లి గ్రామాల మధ్యతారు రోడ్డు పునరుద్ధరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సుమారు 3 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. గతంలో ఈ రహదారి గోతులు తేలి ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేనంత అధ్వాన్నంగా తయారైంది.రోడ్డు బాగు చేయమని కోరుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పాలకులు, అధికారులకు ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు ఎన్ని వినతులు అందించినా పట్టించుకున్న పాపాన పోలేదు. సమస్యను ఆయా గ్రామాల నాయకులు గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి రోడ్డు పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయించారు. రోడ్డు పనులు చేపడుతుండడంతో శాశనపల్లి సర్పంచ్ వెంకటఅప్పారావు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


శరవేగంగా సాగుతున్న సోమయాజులపాలెం–శాశనపల్లి రోడ్డు పనులు